క్లుప్తంగా

పోక్సో కేసులో ఆటోడ్రైవర్ అరెస్ట్



ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ కందుకుల శివాజీని ఏసీపీ శివ రామయ్య పోక్సో చట్టం, ఇతర పలు సెక్షన్ల కింద గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఏసీపీ వివరాలు వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన బాలికను శివాజీ 5 నెలల క్రితం ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని తెలిపారు. బాలికలు మాయమాటలు నమ్మి మోసపోవద్దని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు పిల్లలను ఓ కంట కనిపెట్టాలని సూచించారు. మైనర్లకు వివాహం చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బాలికల, మహిళల పట్ల తప్పుగా ప్రవర్తిస్తే శిక్ష తప్పదని చెప్పారు. కార్యక్రమంలో సీఐ బండారి కుమార్, ఎస్సై ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



ఆత్మకూరు : మండలంలోని లింగమడుగులపల్లి గ్రామానికి చెందిన అపరాతి నాంపల్లి యాదవ్‌ను తెలంగాణ పేదల ఆర్థిక రాజ్యాధికారి సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడుగా, రాష్ట్ర కార్మిక విభాగం అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సింగారం ప్రేమ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాంపల్లి ఉమ్మడి జిల్లాలో పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. కరోనా సమయంలో పేదలకు నిత్యావసరాల సరుకుల పంపిణీ చేశారని తెలిపారు. బీసీ సంఘంలోనూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని వివరించారు. ఈ క్రమంలోనే నాంపల్లికి పదవి కట్టబెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో నాంపల్లి మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి పదవులు ఇచ్చినందుకు వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌కు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటికాయల రాజ్‌కుమార్‌కు, రాష్ట్ర కార్యదర్శి మేకల యాదగిరి, కోశాధికారి గుండె మహేందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా చక్రపాణి

ధర్మసాగర్ (వేలేరు) : బీఎస్పీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా తనను నియమించినట్లు వేలేరు మండల కేంద్రానికి చెందిన మోకినపల్లి చక్రపాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ తనకు నియామక పత్రం అందచేసినట్లు పేర్కొన్నారు. బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లోని వెంకటసాయి గార్డెన్‌లో నేడు (శుక్రవారం) బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ వంగ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముత్తారం, ముల్కనూర్, కొత్తపల్లి, రాంనగర్, వంగర, రంగయ్యపల్లి, రత్నగిరి, మాణిక్యాపూర్, గాంధీనగర్, కొప్పూర్, విశ్వనాథకాలనీ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

శాయంపేట : మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు (శుక్రవారం) ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కందగట్ల రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్యసేవలు అందిస్తోందని పేర్కొన్నారు. కంటి సమస్యతోపాటు రక్తపోటు, షుగర్, ఊపిరితిత్తుల సమస్యలకు సంబంధించి ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందిస్తారని వివరించారు. లేబర్ కార్డు కలిగిన వ్యక్తులు ఆధార్, లేబర్ కార్డుతో వచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ కడియం పరామర్శ



ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపెల్లి గ్రామానికి చెందిన పిన్నింటి రాంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుటుంబాన్ని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి గురువారం పరామర్శించారు. తొలుత రాంరెడ్డి మృతదేహానికి శ్రీహరి పూలమాల వేసి నివాళులర్పించారు. కడియం వెంట సర్పంచ్ గండి మల్లికాంబ, నాయకులు రమేశ్, తదితరులున్నారు.

వేడుకగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పరకాల : జెండా ఎగరేస్తున్న భిక్షపతి



కమలాపూర్‌లో..



శాయంపేట : పత్తిపాకలో..



ఎల్కతుర్తిలో..



భీమదేవరపల్లి : ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

పరకాల : పట్టణంలోని బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి పార్టీ జెండా ఎగరేసి మాట్లాడారు. రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, కార్యదర్శి ఎర్ర రామన్న, నాయకులు దేవు సాంబయ్య, కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి, మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శులు గాజుల నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండల కేంద్రంలో బీజేపీ జెండాను ఆ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి ఎగరేసి స్వీట్లు పంచిపెట్టగా కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్‌బాబు హాజరై మాట్లాడారు. కార్యక్రమాల్లో బీజేపీ హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కోకన్వీనర్ మాట్ల రమేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ పల్లె వెంకట్ రెడ్డి, ఎంపీటీసీ కొండం శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ కొలిపాక తిరుపతి, నాయకులు బోగి భిక్షపతి, కొలుగూరి రాజ్‌కుమార్, ఇనుగాల రత్నాకర్, పుల్ల శోభన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని పత్తిపాకలో బీజేపీ జెండాను బూత్ కమిటీ అధ్యక్షుడు పున్నం సాంబయ్య ఆవిష్కరించగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం రమేష్, నాయకులు ఉప్పు రాజు, రామకృష్ణ, మల్లారెడ్డి, రాకేశ్‌రెడ్డి, సుమన్, రాజశేఖర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బీజేపీ జెండాను ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి ఎగరేసి ప్రయాణికులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆడెపు శ్రీవర్ధన్, కంచర్ల శంకరయ్య, జనగాని కిష్టయ్య, ఎంపీటీసీ గొర్రె ఆదాం, చిదురాల వెంకటేశ్, రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భీమదేవరపల్లిలో..

స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్ గౌడ్ జెండా ఎగరేసి స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొమురయ్య, మాచర్ల కుమార్, అంబేటి కవిత, గండు సారయ్య, భిక్షపతి, సదానందం, సాయి, సుధాకర్ పాల్గొన్నారు.

పఠనాసక్తి పెంచడమే లక్ష్యం



రీడింగ్ కార్నర్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాస్, రాధ

ఐనవోలు : విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'రీడింగ్ కార్నర్' పేరిట పాఠశాలల్లో లైబ్రరీలను ఏర్పాటు చేస్తోందని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఏ.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని రాంనగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 'రీడింగ్ కార్నర్' లైబ్రరీని విద్యాశాఖ జిల్లా క్వాలిటీ సెల్ కోఆర్డినేటర్ ఏ.శ్రీనివాస్, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీఓ) రాధ ముఖ్యఅతిథులుగా హాజరై గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థులకు రీడింగ్ కార్నర్ ఉపయోగపడుతుందని చెప్పారు. రూం టు రీడ్ సొసైటీ, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా కొలాబరేషన్‌తో ప్రభుత్వం తొలిసారిగా 259 కథల పుస్తకాలను ప్రాథమిక పాఠశాలలకు అందజేయనుందని తెలిపారు. విద్యార్థుల సంఖ్యను బట్టి మండలంలోని 26 పాఠశాలలకుగాను 9 పాఠశాలలకు ప్రభుత్వం రీడింగ్ కార్నర్ లైబ్రరీలను మంజూరు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమం కింద జిల్లావ్యాప్తంగా 152 స్కూల్స్ సెలెక్ట్ అయినట్లు తెలిపారు. రీడింగ్ కార్నర్‌ను చైల్డ్ మేనేజ్‌మెంట్ కమిటీ మానిటర్ చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు బ్రహ్మచారి, ఎస్ఎంసీ చైర్మన్ రేణుక, ఉపసర్పంచ్ సుధాకర్, సెక్రటరీ రఘురాం, అంగన్‌వాడీ టీచర్ శారద తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో మొలుగూరి భిక్షపతి, తదితరులు

పరకాల : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) పరకాల నగర శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర చేపట్టగా బీజేపీ నేత, స్థానిక మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, నాయకులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ పాల్గొని ఉత్సాహం నింపారు. చిన్నారులు, పెద్దలు వీరహనుమాన్ జెండాలు చేత పట్టుకుని 'జై హనుమాన్.. జై శ్రీరాం' నినాదాలతో నృత్యం చేస్తూ హోరెత్తించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పరకాల కన్వీనర్ గంధ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు డాక్టర్ చెనుమల్ల వెంకటరత్నం, నాయకులు కాచం గురుప్రసాద్, ఆర్పీ.జయంత్‌లాల్, ఎర్ర రామన్న, మార్త భిక్షపతి, గాజుల నిరంజన్, కుక్కల విజయ్‌కుమార్, సంగా పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, దార్న నారయణదాసు, దుబాసి వెంకటస్వామి, సిరంగి సతీష్, కానుగుల గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదాతలకు సర్టిఫికెట్ అందజేస్తున్న సంపత్

ఎల్కతుర్తి : రక్తదానం చేయడాన్ని సామాజిక బాధ్యతగా మాజీ ఎంపీపీ సంగ సంపత్ అభివర్ణించారు. కావేరి సీడ్స్ సంస్థ ఈజీఎమ్ సుమన్‌రావు జన్మదినం సందర్భంగా భీమదేవరపల్లి మండలంలోని గట్ల నర్సింగాపూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఆరోగ్యవంతులు రక్తదానం చేస్తే మంచిదని తెలిపారు. వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి రక్తనిధి సేకరణ కోఆర్డినేటర్ కళ్యాణి సుమారు 30 మంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లతోపాటు పండ్లు, గుడ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, నాయకులు జయంత్, రాంకిషన్‌రావు, మధుసూదన్‌రావు, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, కడారి రమేశ్, సాయి పాల్గొన్నారు.

రవీందర్‌కు దళితరత్న అవార్డు

ఐనవోలు : డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం 116వ జయంతి సందర్భంగా మండలంలోని ఉడుతగూడెంకు చెందిన మిద్దెపాక రవీందర్‌కు రాష్ట్ర ప్రభుత్వం దళితరత్న అవార్డు అందజేసింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ సంక్షేమ శాఖ కమిషనర్ యోగితరాణి, ఉత్సవ కమిటీ చైర్మన్ మేడి పాపయ్య చేతుల మీదుగా రవీందర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రవీందర్ మాట్లాడారు. తాను సామాజిక ఉద్యమాల్లో చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి దళితరత్న అవార్డు అందించిందని చెప్పారు. అవార్డు రావడానికి సహకరించిన ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రజిత

శాయంపేట : కంటి వెలుగు శిబిరాన్ని అర్హులైన ప్రజలందరూ వినియోగించుకోవాలని సర్పంచ్ బొల్లెద్ల రజిత రఘుపతిరెడ్డి కోరారు. మండలంలోని సూరంపేట గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పేదల కంటి సంబంధిత సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణ, ఉపసర్పంచ్ పావురాల స్వాతి వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి సంతోశ్ పాల్గొన్నారు.

'పది' పరీక్షకు కట్టుదిట్టమైన భద్రత



కాలునొప్పితో బాధపడుతున్న విద్యార్థిని తీసుకెళ్తున్న తహసీల్దార్ రియాజుద్దీన్

దామెర : కట్టుదిట్టమైన భద్రత నడుమ మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లోని కేంద్రంలో గురువారం పదో తరగతి పరీక్ష నిర్వహించారు. ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. పోలీసులతోపాటు ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పరీక్ష కేంద్రం వద్ద విధులు నిర్వహించారు. పరీక్షకు ముందు విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి హాలులోకి పంపించారు. భద్రతను తహసీల్దార్ రియాజుద్దీన్ పర్యవేక్షించారు. ఓ విద్యార్థి కాలు నొప్పితో బాధపడుతూ పరీక్ష రాయడానికి మొదటి అంతస్తులోని హాలులోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతుండగా అతడిని తహసీల్దార్ రియాజుద్దీన్, వీఆర్ఏ మహేశ్ తీసుకెళ్లారు. 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు ఎస్సై ముత్యం రాజేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

దామెర : సమాజంలోని ప్రతిఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన అవసరమని స్థానిక వైద్యాధికారి డాక్టర్ మంజుల తెలిపారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఆర్‌పై మహిళలకు ఆమె అవగాహన కల్పించారు. అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వ్యక్తికి అందించాల్సిన చికిత్సను ప్రాక్టికల్‌గా వివరించారు. అనంతరం మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. చిన్న, పెద్ద వయోభేదం లేకుండా ఇటీవలి కాలంలో పలువురు కార్డియాక్ అరెస్ట్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం ఝాన్సీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్పందన, కార్యదర్శి సాగరిక, కోశాధికారి రజిత, సీసీలు నగేశ్, మాధవి, శ్రీనివాస్, అకౌంటెంట్ సుకినె రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



పరకాల : పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ ఉపాధ్యాయుడు దాసరి నాగరాజు మహానంది అవార్డు అందుకోగా ఆయన్ను పట్టణానికి చెందిన ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. నాగరాజు కళానైపుణ్యాన్ని గుర్తించిన ఓ చానల్ నిర్వాహకులు ఏపీ రాష్ట్రంలోని విజయవాడ వేదికగా ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ నాయకులు బొజ్జ హేమంత్, కోగిల ప్రేమ్ మాట్లాడారు. నాగరాజుకు అవార్డు అందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఒంటేరి వరుణ్, కమలాకర్, అజయ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులతో సెక్యులరిజం వ్యాప్తి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ పాషా

ధర్మసాగర్ : ఇఫ్తార్ విందులతో ప్రజల్లో సెక్యులర్ భావజాలం వ్యాప్తి చెందుతుందని డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ యాకూబ్ పాషా తెలిపారు. ఇగ్నైటెడ్ మైండ్ సంస్థ ఆధ్వర్యంలో ధర్మప్రకాశ్ అధ్యక్షతన ధర్మసాగర్, వేలేరు మండలాలకు చెందిన ముస్లిం ఉపాధ్యాయ, ఉద్యోగ మిత్రులకు కాజీపేట ఫాతిమానగర్‌లోని బాబా ఫంక్షన్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు యాకూబ్ పాషా పాల్గొని మాట్లాడారు. రంజాన్ పండుగను సర్వమత సమానత్వానికి ప్రతీకగా అభివర్ణించారు. సీనియర్ ఉపాధ్యాయుడు అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిర్వహించే కార్యక్రమాలు హిందూ, ముస్లింల ఐక్యతకు తోడ్పడతాయని చెప్పారు. రంజాన్ పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఇగ్నైటెడ్ మైండ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి కిరణ్, కోశాధికారి మోహన్, రంజాన్ సర్వర్, అశ్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



దామెర : మండలంలోని ముస్త్యాలపల్లి, తక్కళ్లపహాడ్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్‌రావు గురువారం సందర్శించి పరిశీలించారు. జాబ్‌కార్డ్ కలిగిన ప్రతిఒక్కరూ పనులను వినియోగించుకోవాలని సూచించారు. మండలంలోని 1460 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరైనట్లు తెలిపారు. ఆయన వెంట ఏపీఓ శారద, కార్యదర్శులు మణిదీప్, ధర్మారెడ్డి తదితరులున్నారు.

9న సహాయమాత పుణ్యక్షేత్ర ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న విచారణ గురువు జోసెఫ్

ధర్మసాగర్ : ఈనెల 9న (ఆదివారం) మండల కేంద్రంలోని సహాయమాత పుణ్యక్షేత్ర ప్రారంభోత్సవం ఉంటుందని సెయింట్ ఆంథోనీ దేవాలయ విచారణ గురువు ఫాదర్ కె.జోసెఫ్ తెలిపారు. మండల కేంద్రంలోని గురు నిలయంలో సహాయమాత పుణ్యక్షేత్ర కమిటీ సభ్యులు, దేవాలయ సంఘ పెద్దల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సహాయమాత కమిటీ అధ్యక్షుడు బొడ్డు ప్రభుదాస్‌తో కలిసి విచారణ గురువు జోసెఫ్ మాట్లాడారు. మండల కేంద్రంలోని రిజర్వాయర్ ప్రాంతంలో కొన్నేళ్ల క్రితం నెలకొల్పిన సహాయమాత పుణ్యక్షేత్ర ప్రారంభోత్సవానికి కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొని దీవెనలు పొందాలని కోరారు. ఆదివారం జరిగే ఈస్టర్ పండుగలో వరంగల్ బిషప్ మహాగణ ఉడుముల బాల సారథ్యంలో పుణ్యక్షేత్ర ప్రారంభోత్సవం ఉంటుందని వివరించారు. ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బొడ్డు వాసుదేవ్, పాలిమేర గోపాల్, బొడ్డు కుమార్, బొడ్డు సోమయ్య, మాచర్ల రవీందర్, బొడ్డు ప్రతాప్, బొడ్డు లెనిన్, బొడ్డు కరియప్ప, మాచర్ల ఏలియా, పొన్నాల జడ్సన్, ఇసంపెల్లి రమేష్, గంగారపు కమలాకర్, గబ్బెట చార్లెస్, బొడ్డు సురేందర్, పాడిశెట్టి కరుణాకర్, మాచర్ల ప్రవీణ్, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



నడికూడ : హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో 20 మంది ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు గురువారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడారు. ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేలా కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భార్గవి, కారోబార్ రమేశ్, శివ, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'సంజయ్ అరెస్ట్ అప్రజాస్వామికం'



దిష్టిబొమ్మను దహనం చేస్తున్ననాయకులు

ఆత్మకూరు : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్ అప్రజాస్వామికమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం అన్నారు. మండలంలోని గూడెప్పాడ్ సెంటర్‌లో ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడారు. బీఆర్ఎస్ నేతల లిక్కర్, లీకేజీ కుంభకోణాలను కప్పి పుచ్చుకోవడానికే ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా బీజేపీ నాయకులను అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి రవ్వ శివప్రసాద్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ సాయికృష్ణ, మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి, నాయకులు బయ్య పైడి, సాయి, గోపాల్, రాజిరెడ్డి, బలభద్ర దినేశ్, కిరణ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'గద్దె నిర్మాణ పనులను అడ్డుకున్నారు'



ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కోసం చేపట్టిన గద్దె నిర్మాణ పనులను దామెర గిద్ద ప్రభాకర్, కుటుంబ సభ్యులు అడ్డుకున్నారని అంబేడ్కర్ అభివృద్ధి కమిటీ సభ్యులు మల్లేశం, అనిల్ తెలిపారు. విగ్రహ ఏర్పాటు స్థలంలో వారు విలేకరులతో గురువారం మాట్లాడారు. పనులను అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై ప్రభాకర్ వివరణ కోరగా తమకు వారసత్వంగా వచ్చిన భూమిలో గద్దె నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. గతంలో గ్రామ పంచాయతీతోపాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్సై మాధవ్‌ను వివరణ కోరగా లిఖిత పూర్వక ఫిర్యాదు అందలేదన్నారు.